సాక్షి బాపట్ల

ఆదివారం | 20 | ఏప్రిల్ | 2025



కుంకుమ పూజలు

బాపట్ల: బాపట్ల అధిష్టాన దేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవాలయం వద్ద శనివారం అత్యంత వైభవంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



తల్లులకు అవగాహన

తెనాలి: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా తెనాలిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశాలు జరిపారు. పిల్లల్లో అధిక బరువుపై తల్లులకు అవగాహన కల్పించారు.



యునెస్కో గుర్తింపుపై హర్షం

మొవ్వ: యునెస్కో మెమొరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో నాట్య శాస్త్రాన్ని ప్రత్యేకంగా నమోదు చేయడంపై కూచిపూడి నాట్య క్షేత్రం, కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

బీమా.. ఏదీ ధీమా?

- 2024 మార్చి తర్వాత అమల్లోకి రాని పథకం
- 13 నెలలుగా ఎదురు చూపులకే పరిమితం
- ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్భాట ప్రకటన
- అధికారం చేపట్టి పది నెలలైనా అతీగతీలేదు



చంద్ర బీమా ఎన్నికల లోగో(ఫైల్)

వేటపాలెం: సంక్షేమ పథకాల అమలును కూటమి సర్కారు గాలి కొదిలేసింది. కనీసం బీమా పథకమైనా అమలు చేస్తే కాస్త భరోసా ఉంటుందని పేద ప్రజలు భావించారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వైఎస్సార్ బీమాను అమలు చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి పేదోడికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయం అందించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నేరుగా బాధితుల వద్దకే వెళ్లి సీఎం సహాయ నిధి పరిహారం అందించారు. సవ్యంగా సాగుతున్న ఈ పథకం సార్వత్రిక ఎన్నికల తర్వాత కుంటుపడింది. పథకం పేరును చంద్రన్న బీమాగా మార్చి అమలును మాత్రం వదిలేశారు. దీంతో సహజ మరణంతోపాటు ప్రమాదవశాత్తూ మరణించిన కుటుంబాలు పది నెలలుగా పరిహారం కోసం ఎదురు చూస్తున్నాయి. అసలు బీమా పథకం ఇస్తారా? ఎత్తేస్తారా? అనే అనుమానాలు వ్యక్తవుతున్నాయి. బాపట్ల జిల్లా వ్యాప్తంగా 4,70,200 రేషన్ తెల్లకార్డులు ఉన్నాయి. వీటంతా దారిద్ర్యరేఖకు దిగువగా ఉన్నవారు. చీరాల నియోజకర్గం పరిధిలోని చీరాల టౌన్, రూరల్, వేటపాలెం మండలాల పరిధిలో 57,010 మంది తెల్లరేషన్ కార్డులు దారులు ఉన్నారు. ఏఏవై, తెల్ల రేషన్ కార్డులు కలిగిన వారంతా బీమా పథకానికి అర్హులు. ప్రమాదవశాత్తూ ఏదో ఒక రూపంగా మృత్యువు నిత్యం కబళిస్తూనే ఉంది. అయితే ఆదుకోవాల్సిన బీమా పథకం అమలు చేస్తారో? లేదో తెలియడం లేదు.

రూ.10 లక్షలు మాటేంది...

బీమా పథకాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తాం. అర్హులందరికీ న్యాయం చేస్తాం. వైఎస్సార్ సీపీ హయాంలో కంటే రెట్టింపు సాయం అందిస్తాం.. సహజ మరణానికైతే రూ.5 లక్షలు, ప్రమావశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలు ఇస్తామంటూ కూటమి నాయకులు ఎన్నికలప్పుడు ఊరూరా ఊదర గొట్టారు. ఎన్నికల మేనిఫెస్టోలోనూ ముంద్రించి ఇంటింటా పంపిణీ చేశారు. అధికారం చేపట్టాక వక్ర బుద్ధి చూపుతున్నారు. 2024 మే 13 నుంచి బీమా పథకం వివరాలు వెబ్‌సైట్ నుంచి తొలగించారు. తర్వాత నమోదుకు అవకాశం కల్పించలేదు. అప్పటి నుంచి ఎన్నో కుటుంబాలు రోడ్డు పాలై సీఎం రిలీఫ్ ఫండ్ కోసం వేచి చూడాల్సి వస్తోంది.

బీమా ఉంటే కుటుంబాన్ని ఆదుకునేది

నేను కూలి పనులు చేసుకొని జీవిస్తున్నాను. ఎదిగి వచ్చిన కొడుకు కుటుంబాన్ని ఆదుకుంటాడని భావించాం. ఆరు నెలల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో నా కుమారుడు మృతి చెందాడు. అదే బీమా పథకం ఉంటే రూ.10 లక్షలు సాయం అందేది. ఇప్పటికైనా రూ.10 లక్షలు పరిహారం అందించి ఆదుకోవాలి

–లక్ష్మి, వేటపాలెం:

మార్గదర్శకాలు రావాలి

ప్రభుత్వం నుంచి బీమా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు వెలువడలేదు. సచివాలయాల్లో ఈ పథకానికి సంబంధించిన వెబ్‌సైట్ ఆన్‌లో లేదు. మార్గదర్శకాలు రాగానే అమలు చేస్తాం.

–అంజిబాబు, ఏపీఎం, వేటపాలెం:

అంతర్‌జిల్లాల దొంగలు అరెస్టు

- పది లక్షల విలువైన బంగారం, రెండు బైకులు స్వాధీనం
- పోలీసులకు రివార్డులు అందజేసిన డీఎస్పీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మొయిన్

మేదరమెట్ల: పలు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు అంతర్ జిల్లాల దొంగలను కొరిశపాడు మండలం మేదరమెట్ల వై.జంక్షన్ వద్ద శనివారం మేదరమెట్ల పోలీసులు అరెస్టు చేశారు. చీరాల డీఎస్పీ ఎస్‌డీ మొయిన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల ఒకటో తేదీ సాయంత్రం వరుసగా రెండు చైన్‌స్నాచింగ్ సంఘటనలు మేదరమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగాయి. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల, కొరిశపాడు, పంగులూరు ఎస్‌ఐలు షేక్ మహ్మద్ రఫీ, వై.సురేష్, బీ.వినోద్‌బాబులు టీంగా ఏర్పడి సీసీ కెమెరాల ఆధారంగా ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ దొంగల కోసం ఆధారాలు సేకరించారు. కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన దర్శనాల ఏడుకొండలు మరో ముద్దాయి అదే గ్రామానికి చెందిన షేక్ ఆషిద్‌లను మేదరమెట్ల వై.జంక్షన్ వద్ద మోటారు బైకుపై ఉన్నారన్న సమాచారం రావడంతో మేదరమెట్ల పోలీసులు నిందితులిద్దరినీ అరెస్టు చేసినట్లు వారి వద్ద నుంచి 126 గ్రాముల బంగారు చైన్‌లు రెండు మోటారు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఏడుకొండలుపై గతంలో చీమకుర్తి స్టేషన్‌లో మూడు, టంగుటూరు స్టేషన్‌పరిధిలో ఒక కేసు నమోదై ఉన్నట్లు ఆయన తెలిపారు. రెండో ముద్దాయి షేక్ ఆషిద్‌పై కొత్తపట్నం పోలీసుస్టేషన్ పరిధిలో ఒకటి, ఒంగోలు ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో రెండు దొంగతనాల కేసులు ఉన్నట్లు తెలిపారు. వీరిద్దరూ ముప్పవరం, పంగులూరు, కొరిశపాడు సమీప గ్రామాల్లో చైన్‌స్నాచింగ్‌లకు రెక్కీలు నిర్వహించినట్లు తెలిసింది. వేసవికాలం కావడంతో దొంగతనాలు పెరిగే అవకాశం ఉందని ఒంటరిగా ఉండే మహిళలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. అంతర్ జిల్లాల దొంగలను పట్టుకున్న సందర్భంగా సీఐ, ఎస్‌ఐలతోపాటు నాయబ్‌రసూల్, తిరుపాల్‌రెడ్డి, జీ.సురేష్, ఎస్.రమేష్‌లను రివార్డులతో అభినందించారు.



స్వాధీనం చేసుకున్న మోటారు బైకులు

భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలి

గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: భూ సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శనివారం రాత్రి కలెక్టరేట్‌లో పలు రెవెన్యూ అంశాలపై నిర్వహించిన వర్క్‌షాపులో కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలు, వెబ్‌ల్యాండ్ టెక్నికల్ సమస్యలు, రీసర్వే తదితర అంశాల నుంచి అధిక ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. సమస్యలకు కారణాలు పరిశీలించాలని, ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని పేర్కొన్నారు. వెబ్‌ల్యాండ్‌కు సంబంధించి సమస్యల పరిష్కారం జాయింట్ కలెక్టర్ లాగిన్‌లోనే చేయాల్సి ఉందన్నారు. కలెక్టర్ స్థాయిలోనే అన్ని సమస్యలూ పరిష్కారం కావడం వల్ల జాప్యం అవుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా కొన్ని సమస్యల పరిష్కారానికి అర్జీదారులు పదేపదే వస్తున్నారని, దీన్ని అధికారులు గుర్తించాలన్నారు. సమస్య పరిష్కారం కాని వాటిని వారికి వివరించి చెప్పాలన్నారు. అధికంగా వస్తున్న సమస్యలపై రెవెన్యూ శాఖ అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీవో కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

గుంటూరుఎడ్యుకేషన్: నల్లచెరువులోని అంబేడ్కర్ ఎయిడెడ్ పాఠశాలలో సర్దుబాటుపై పనిచేస్తున్న ఇద్దరు సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, డి.రవిని సస్పెండ్ చేస్తూ గుంటూరు డీఈఓ సీవీ రేణుక శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. విధుల్లో నిర్లక్ష్యం, విద్యార్థుల హాజరు నమోదులో అవకతవకలు, మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థుల సంఖ్యను పెంచి చూపడం, సరైన రికార్డులను నిర్వహించకపోవడం వంటి అంశాలపై ఎంఈఓ, డీవైఈఓలతో విచారణ జరిపించిన డీఈఓ వారి నివేదిక ఆధారంగా సంబంధిత ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. పాఠశాలను డీఈఓ తనిఖీ చేసిన సమయంలో 46 మంది విద్యార్థులను ఆన్‌లైన్ హాజరులో నమోదు చేయడం, తీరా పాఠశాలలో భౌతికంగా హాజరైన విద్యార్థులు తొమ్మిది మందే ఉండటంపై విచారణకు ఆదేశించారు. రెండు రోజుల క్రితం డీవైఈవో, ఎంఈవో పాఠశాలకు స్వయంగా వెళ్లి, సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ నిరంతరం ప్రజాపక్షం

- అధికారం ఉన్నా.. లేకున్నా ప్రజలతోనే ప్రయాణం
- రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి
- పార్టీ గుంటూరు నగర కార్యాలయం ప్రారంభం



వైఎస్సార్ సీపీ నగర కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చిత్రంలో అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాలరెడ్డి, కల్పలతారెడ్డి, నూరిఫాతిమా తదితరులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): అధికారంలో ఉన్నా.. లేకున్నా.. వైఎస్సార్ సీపీ ఎప్పుడూ ప్రజాపక్షమేనని రాజ్యసభ సభ్యులు, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా కొత్త కార్యాలయ ప్రారంభోత్సవం శనివారం జరిగింది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కొత్త కార్యాలయాన్ని ప్రారంభించారు. ముందుగా వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించిన అనంతరం సర్వమత ప్రార్థనలు జరిపి కార్యాలయాన్ని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. తొలుత కాకాని వైజంక్షన్ నుంచి భారీ బైక్ ర్యాలీతో వైవీ సుబ్బారెడ్డికి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం కోసం సూపర్‌సిక్స్ హామీలను గుప్పించిందని విమర్శించారు. ప్రజలు వాటిని ఎక్కడ అడుగుతారో అని అక్రమ అరెస్టులు, బెదిరింపులతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ధ్వజమెత్తారు. ఎన్ని కేసులు పెట్టినా.. అక్రమ అరెస్ట్ చేసినా.. వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదని, కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మాట్లాడుతూ నూతనంగా నగర కార్యాలయాన్ని ప్రారంభించటం సంతోషదాయకమన్నారు. రాబోయే రోజుల్లో అన్ని డివిజన్‌లు, నగర కమిటీ, అనుబంధ విభాగాల కార్యాలయాలను అందరి సహకారంతో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ గుంటూరు, నర్సరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నగర ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యాలయాన్ని ప్రారంభించటం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, అరాచకపాలనపై కొండంత ధైర్యంతో ముందుకు సాగేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారన్నారు. నూరిఫాతిమా తమకు సోదరిలాంటిందని, ఆమెకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.

గోవుల మృతిపై విచారణ జరపాలి

అనంతరం మీడియాతో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తిరుమలలో గోవులు మృతి చెందటం బాధాకరమన్నారు. దీనిపై కచ్చితంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గోశాలలో 1,500పైగా గోవులు ఉండేవని, అనారోగ్యంతో మృతి చెందితే ఆ దారి వేరని, కూటమి ప్రభుత్వం లోపాల వల్ల మరణించడం బాధాకరమన్నారు. వైఎస్సార్ సీపీలో నెంబర్ వన్..టూ అంటూ ఉండదని.. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి ఒక్కరం ముందుకు సాగుతామన్నారు. పార్టీలో ఉన్నప్పుడు విజయసాయిరెడ్డికి కోటరీల గురించి తెలియదా అంటూ ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీలో ఎవరికీ ప్రాధాన్యం తగ్గించడం, పెంచడం ఉండవని, అప్పజెప్పిన బాధ్యతను అందరూ చిత్తశుద్ధితో చేసుకుంటూ పోవడమేనని పేర్కొన్నారు.

ప్రజల పక్షాన పోరాటానికి వెనుకాడం : నూరిఫాతిమా

ప్రజల పక్షాన పోరాటాలకు వెనుకాడబోమని, వారి సమస్యలను గొంతెత్తి నినదిస్తామని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా స్పష్టం చేశారు. జగనన్న తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కచ్చితంగా పార్టీని అన్ని విధాలుగా ముందుకు తీసుకుని వెళ్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న ప్రతి కార్యకర్తను కుటుంబ సభ్యుడిలా చూసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, డెప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

‘మంట’చింతల

రెంటచింతలలో 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత



రెంటచింతల: వేసవిలో మంటచింతలగా ప్రసిద్ధిచెందిన రెంటచింతల నిప్పుల కొలిమిగా భగభగ మండుతోంది. రెండు తెలుగు రాష్ట్రాలలో ఏటా వేసవికాలంలో ఏరోజు ఎండ ఎక్కువ కాసినా రెంటచింతల ఉష్ణోగ్రత ఎంత అని అడగడం సహజం. గురువారం గ్రామంలో గరిష్ట ఉష్ణోగ్రత 43.4 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 28.6 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ అధికారులు తెలిపారు. కొద్ది రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో గ్రామస్తులు అల్లాడుతున్నారు. వృద్ధులు, బాలింతలు, చిన్నారులు, గర్భిణుల అవస్థలు వర్ణనాతీతం. గ్రామస్తులు ఉదయం పదిగంటలు దాటితే బయటకు రాలేని దుస్థితి నెలకొంది. కొబ్బరిబొండాలు, చెరుకురసం వంటి శీతలపానీయాలతో కొంతవరకు ఉపశమనం పొందుతున్నారు. వ్యవసాయ, వివిధ పనులకు వెళ్ళే కూలీలు ఎండతీవ్రత తట్టుకోలేక 11.30 గంటలకల్లా ఇంటిముఖం పడుతున్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెనుముప్పు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వ్యర్థాలు పర్యావరణానికి పెనుముప్పు అని, వాటిని శాస్త్రీయ పద్ధతిలో నాశనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయనంద్ చెప్పారు. శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ–వ్యర్థాల నిర్వహణపై గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర స్వచ్ఛంద్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మరెడ్డి పట్టాభిరామ్, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఏ. భార్గవ్‌తేజ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీలా, ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులతో కలిసి విజ్ఞాన మందిరం ఆవరణలో మొక్కలు నాటి, నగరంలో ఈ – వ్యర్థాల సేకరణ చేసే వాహనాన్ని ప్రారంభించి, సిగ్నేచర్ క్యాంపెయిన్‌లో సంతకం చేశారు. వివిధ రంగాల స్టాల్లను పరిశీలించారు. సీఎస్ మాట్లాడుతూ ఈ–వ్యర్థాల ఉత్పత్తి ఎక్కువగా ఉందని, వాటిని ఎక్కడపడితే అక్కడ పారేస్తే భూ కాలుష్యం, నీటి కాలుష్యం పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతారని పేర్కొన్నారు. ఈ–వ్యర్థాల సేకరణకు గుంటూరుతోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రెడ్యూస్, రీ యూజ్, రీసైక్లింగ్ (ఆర్ఆర్ఆర్) సెంటర్లను ఏర్పాటుచేసినట్టు వివరించారు. ఈ–వ్యర్థాలను ఆర్ఆర్ఆర్ సెంటర్ల నిర్వహణ ద్వారా సంపద సృష్టించవచ్చని, దీని కోసం ప్రభుత్వం ప్రత్యేక పాలసీని తీసుకురానుందని వివరించారు. రాష్ట్రంలో మూడు నెలలుగా జరుగుతున్న స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో 1.90 కోట్ల మంది పాల్గొన్నారని, స్వచ్ఛత కార్యక్రమాలను ఉద్యమంగా యుద్ధప్రాతిపదికన ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవ సంస్థల భాగస్వామ్యంతో కొనసాగించటం ద్వారా స్వచ్ఛంద్ర తద్వారా స్వర్ణాంధ్ర సాధ్యం అవుతుందన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈ–వ్యర్థాల సేకరణకు ప్రత్యేకంగా ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గుంటూరులోని ప్రతి సచివాలయంలో ఆర్ ఆర్ ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.



ఈ–వేస్ట్ స్టాల్ వివరాలను తెలుసుకుంటున్న సీఎస్ విజయనంద్ చిత్రంలో ఎమ్మెల్యే, కలెక్టర్

న్యూస్‌రీల్

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఏఆర్ డీఎస్పీ విజయసారథి



బాపట్లటౌన్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఏఆర్ డీఎస్పీ విజయసారథి తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అధికారులు శనివారం స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు చుట్టూ ఉన్న పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. భావితరాలకు మెరుగైన ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, ఎంటీ ఆర్ఐ శ్రీకాంత్, ఇతర పోలీసు అధికారులు ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి



నరసరావుపేటటౌన్: స్థానిక ప్రత్యేక ఉప కారాగారాన్ని శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి టి. ప్రవళిక సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిమాండ్ ఖైదీలు ఉచిత న్యాయ సహాయం పొందే విధివిధానాలను వివరించారు. బెయిల్ లభించి జామీనదారులను పెట్టుకునే స్తోమత లేని వారి వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఆ రోజువారి జీవితంలో అవసరమయ్యే అనేక చట్టాలను వివరించారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ రవికుమార్ యాదవ్, ప్యానల్ న్యాయవాది, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన

వినుకొండ: మదమంచిపాటి వీరాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా మక్కెన చినరామయ్య ఆడిటోరియంలో జాతీయ ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు కొనసాగుతున్నాయి. నాలుగ పళ్ల సైజు విభాగంలో 10 జతలు పాల్గొన్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మక్కెన వెంకట్రావు, అనుమాల సుబ్బారెడ్డి, మదాల చిరంజీవి, కుంటా కోటిరెడ్డి, జగ్గారెడ్డి, అక్కిరెడ్డి, రొడ్డా నాగిరెడ్డి, జక్కిరెడ్డి కోటిరెడ్డి, జక్కిరెడ్డి, నాగిరెడ్డి, గురువారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలు యూడైస్‌లో రిజిస్టర్ కావాలి

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 1వ తరగతి ఉన్న అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శనివారం తెలిపారు. ప్రభుత్వం ఆర్‌టీఈ 12 (1)సీ ఉత్తర్వులు ఇచ్చినందున జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు cre.ap.gov.in పోర్టల్‌లో యుడైస్ యూజర్ ఐడి, పాస్‌వర్డ్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. దానిలో పాఠశాల గుర్తింపు కాపీని అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈనెల 19వతేది నుంచి 25వతేదీలోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులకు తాత్కాలిక సీనియార్టీ జాబితా

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జోన్ పరిధిలోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రభుత్వ యాజమాన్యంలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులకు అర్హులైన వారితో తాత్కాలిక సీనియార్టీ జాబితాను విడుదల చేసినట్లు ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండోసారి విడుదల చేసిన సీనియార్టీ జాబితాలను

htt pr//doefunturbofrpot.com,
htt pr//doeneore.50webr.com,
www.prakaramrchooedu.com

సైట్‌లలో సందర్శించి, ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తగిన ఆధారాలతో ఈనెల 22లోపు సమర్పించాలని సూచించారు.

క్లుప్తంగా

పరస్పర కేసులు నమోదు

చీరాల: ఇద్దరు వ్యక్తుల మధ్య మొదలైన చిన్న పాటి వివాదాన్ని వారించిన వ్యక్తిపై కత్తితో దాడి చేయగా ఇరువురు ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈపూరుపాలెం కాలువ సమీపంలోని అంగడి కీర్తన సోదరుడు ముత్తు మరో వ్యక్తితో శుక్రవారం రాత్రి ఘర్షణకు దిగగా పొరుగున ఉంటున్న కర్రెద్దుల ఏడుకొండలు వారించాడు. ముత్తు అడ్డుగా వచ్చిన ఏడుకొండలపై కత్తితో దాడి చేయగా చేతికి గాయమైంది. క్షతగాత్రుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశారు.అంగడి కీర్తన ఏడుకొండలుపై ఫిర్యాదు చేయగా ఈపూరుపాలెం పోలీసులు ఇరువురి ఫిర్యాదులపై కేసు నమోదు చేశారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం



బల్లికురవ: పేలుడు పదార్థాలు నిలువచేసే మ్యాగ్జెయిన్‌లను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. వేమవరం జంక్షన్ నుంచి గంగపాలెం వెళ్లే రోడ్డుతో పాటు, నాగరాజుపల్లె సమీపంలోప్రసన్నాంజనేయ ఫ్యాక్టరీలో అక్రమంగా నిల్వ ఉంచిన 2300 మ్యాగ్జెయిన్ ముడి సరుకును స్వాధీనం చేసుకున్నట్లు సంతమాగులూరు సీఐ వెంకట్రావు తెలిపారు. దాడుల్లో బల్లికురవ ఎస్సై వై. నాగరాజు, ఆర్ఐ పోతురాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతి

చీరాల: టూవీలర్‌ను లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతిచెందాడు. ఈనెల 16న పాపాయిపాలెంకు చెందిన రమేష్ బైపాస్ రోడ్డులో వెళుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒంగోలు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న అతడు శనివారం మృతిచెందాడు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నిండా నీళ్లున్న కుంటకు మళ్లీ నీళ్లా!

- అధికారులతో ప్రజాప్రతినిధులు కుమ్మక్కు
- మళ్లీ నీరు పెట్టేందుకు తీర్మానం



సిద్దన్నకుంటకు నీరు పెట్టేందుకు పైపులను పరచిన దృశ్యం



ప్రాసంగులపాడులో నిండుకుండలా కనిపిస్తున్న సిద్దన్నకుంట

మేదరమెట్ల: కుంట నిండా నీళ్ల కనిపిస్తున్నా అధికారులు నేతలతో కుమ్మక్కై మళ్లీ నీళ్ల పెడతామంటూ తీర్మానం చేసిన సంఘటన కొరిశపాడు మండలం ప్రాసంగులపాడు పంచాయతీలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సిద్దన్నకుంటలో పూర్తిస్థాయిలో నీరు నిండా ఉంది. అయినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్థానిక నాయకులతో కుమ్మక్కై నీరు నిండా ఉన్న కుంటకు మరలా నీరు పెడుతున్నట్లు అనంతరం బిల్లులు చేసుకునేలా ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నారు. పనులు చేయకుండానే పనులు చేశామని బిల్లులు చేసుకోవడం ఏమిటని, ఇలా చేస్తుంటే ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి పనులకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జగనన్న కాలనీల్లో వసతులు కల్పించాలి

మంత్రి అనగానికి వినతి



మంత్రి అనగాని కార్యాలయంలో వినతి పత్రం అంజేస్తున్న జగనన్న కాలనీవాసులు

రేపల్లెరూరల్: పట్టణంలోని జగనన్న కాలనీలో కనీస వసతులు కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు శనివారం మంత్రి అనగాని సత్యప్రసాద్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో కనీస వసతులు కరువై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సొంతగూటి కోసం అప్పులు చేసి గృహాలు నిర్మించుకున్న కాలనీవాసులు కాలనీలో వసతులు లేకపోవటంతో నివాసం ఉండలేని పరిస్థితులు వచ్చాయన్నారు. జగనన్నకాలనీ పేరును తొలగించి పీఎంవై ఎన్టీఆర్ కాలనీగా మార్చిన ప్రభుత్వం వసతులు మాత్రం కల్పించలేదన్నారు. డ్రయిన్లు, రహదారులు లేక మురుగు నివాస గృహాల మధ్య నిలిచి పారిశుద్ధ్యం క్షీణించటంతోపాటు దోమలు వృద్ధి చెంది క్షణకాలం ఉండలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కాలనీలో కనీస వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ వి.ధనమ్మ, కో–కన్వీనర్ రవికుమార్, సహాయ కార్యదర్శి కె.నాంచారమ్మ, సభ్యులు వనజాక్షి, కృష్ణకుమారి, రాధా తదితరులు పాల్గొన్నారు.

పూనూరు పోస్టుమాస్టర్‌పై ఖాతాదారుల ఫిర్యాదు

ఉన్నతాధికారుల దర్యాప్తు



పూనూరు పోస్ట్ ఆఫీస్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఎస్‌పీ శ్రీనివాసరావు

యద్దనపూడి: బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం పూనూరు గ్రామ పోస్టుమాస్టర్ అవినీతి ఆరోపణలపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో శనివారం అధికారులు పూనూరులో విచారణ చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.... పూనూరు గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి ఉప్పల సాంబశివరావు గత నెల 6వ తేదీ అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. సాంబశివరావు జీవించి ఉన్న సమయంలో రెండు రికరింగ్ డిపాజిట్లు ప్రారంభించి ప్రతి నెలా రూ.5000 కిస్తీలు చెల్లిస్తూ వచ్చాడు. ఇలా ఫిబ్రవరి నెల వరకు పోస్టుమాస్టరుకు నగదు చెల్లిస్తూ వచ్చాడు. రికరింగ్ డిపాజిట్లకు సంబంధించిన పుస్తకాలు మాత్రం పోస్టుమాస్టరు వద్దే ఉంచుకుంటూ వస్తున్నాడు. అందులో ఒక ఆర్డీ పుస్తకానికి సంబంధించి 7 నెలల వరకు నగదు చెల్లించలేదు. ఇలా సుమారు రూ.17,500 పోస్టుమాస్టరు తన సొంతానికి వాడుకున్నాడని మృతుని కుమారుడు అంకినీడు ప్రసాద్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. సేవింగ్ ఖాతాలో గత సంవత్సరం 7-2-24న, 16-10-24న తేదీన రెండు సార్లు మెత్తం రూ.40 వేలు నగదు డ్రా చేసినట్లు కుటుంబసభ్యులు ఆధారాలతో పోస్టల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాక గ్రామంలో మరికొంత మంది వ్యక్తుల నుండి ఆర్డీల పేరిట నెల నెల కిస్తీలు వసూలు చేసి వాటికి ఇవ్వాల్సిన డిపార్ట్‌మెంట్ తాలుకా రసీదులు ఇవ్వకుండా చిన్నసైజు పాకెట్ సైజ్ పుస్తకంలో నెలనెల ఆర్డీ సొమ్మును జమ చేస్తున్నట్లు ఖతాదారులకు ఇస్తూ పోస్టల్‌శాఖ పుస్తకాలు మాత్రం తన దగ్గరే ఉంచుకుంటున్నాడని పలువురు అధికారులకు తెలిపారు. ఈ విచారణలో భాగంగా చీరాల అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు ఆఫీస్ (ఏఎస్‌పీ) శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులు తీసుకున్నానని పోస్టుమాస్టర్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సంతకాలను ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపి వాస్తవాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

ఉర్దూ పోస్టులు తొలగించడం దారుణం



ఎంఈఓ నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న ద్రోణాదుల గ్రామ ముస్లిం కాలనీవాసులు

మార్టూరు: దశాబ్దాలుగా ముస్లిం జనావాసాల మధ్య ఉన్న ప్రాథమిక పాఠశాలలోని ఉర్దూ పోస్టును తొలగించటం తగదని, పోస్టు కొనసాగించాలంటూ ద్రోణాదుల గ్రామ ముస్లింలు శనివారం మండల విద్యాశాఖ అధికారి ఎంసీహెచ్ వస్రం నాయక్‌కు విజ్ఞప్తి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ద్రోణాదుల ముస్లిం కాలనీలో ఉన్న ఎంపీపీఎస్(పీఎస్) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గత కొన్ని దశాబ్దాలుగా ఉర్దూ సబ్జెక్టుకు సంబంధించిన పోస్ట్ కొనసాగుతూ వస్తుంది. ఇటీవల ప్రభుత్వం అవలంభిస్తున్న నూతన విధానాలలో భాగంగా ఆ పాఠశాలలోని ఉర్దూ పోస్టును తొలగిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక ద్వితీయ అధికార భాషగా ఉన్న ఉర్దూ పోస్టులు ఇప్పటివరకు మండలంలో 11 ఉండగా వాటిలో నాలుగు పోస్టులను తొలగించి ఏడుగురు టీచర్లను మాత్రమే కొనసాగించటం దారుణమని వారు పేర్కొన్నారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు ఉన్నందువలన గత రెండు దశాబ్దాలుగా ఇప్పుడిప్పుడే ముస్లింలు తమ పిల్లలను చదివిస్తూ ఉన్నత స్థానాలకు పంపగలుగుతున్నారని ఈ క్రమంలో ఉర్దూ పోస్టులు రద్దు చేయడం ద్వారా ముస్లింలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఎంఈఓ ఎంసీహెచ్ వస్రం నాయక్కు తమ కాలనీ పరిధిలోని పాఠశాలలో ఉర్దూ పోస్టును కొనసాగించాలని కోరుతూ అర్జీ ఇచ్చారు. కార్యక్రమంలో ద్రోణాదుల ముస్లిం కాలనీ వాసులు పఠాన్ బాషా, షేక్ మస్తాన్, పెద్ద మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ప్రేమయ్య ఎంపిక



ఇంకొల్లు(చినగంజాం) జాతీయ స్థాయిలో నిర్వహించే టీ 20 క్రికెట్ పోటీలకు మండలంలోని నాగండ్ల గ్రామానికి చెందిన బూరగ ప్రేమయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రేమయ్యకు ఆల్ ఇండియా క్రికెట్ డవలప్‌మెంట్ ట్రస్టు నుంచి ఉత్తర్వులు అందాయి. జాతీయ జట్టులో భారత దేశం తరపున క్రికెట్ జట్టులో ప్రేమయ్య బ్యాట్స్‌మన్ ఎంపిక కాగా మే నెల 26 నుంచి 31 వరకు నేపాల్‌లో నిర్వహించే పోటీలలో పాల్గొనున్నట్లు ప్రేమయ్య తెలిపారు. ప్రేమయ్య ప్రస్తుతం నరసరావు పేటలో కృష్ణవేణి డిగ్రీ కాలేజీ నందు డిగ్రీ చదువుతున్నాడు.

ఉత్సాహంగా జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు



పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జత

మార్కాపురం టౌన్: మార్కాపురం లక్ష్మీచెన్నకేశవస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్‌వీకేపీ కళాశాలలో జరుగుతున్న జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు 2వ రోజైన శనివారం ఉత్సాహంగా సాగాయి. పోటీలకు గుంటూరు, నంద్యాల, బాపట్ల, తెలంగాణలోని సూర్యాపేట, పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నాయి. శనివారం పోటీల్లో గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెద్దగొట్టిపాడు గ్రామానికి చెందిన జీఎల్ఆర్ గ్రూప్స్, గరికపాటి లక్ష్మయ్యచౌదరిలకు చెందిన ఎడ్ల జత 4351.06 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిని, నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బీ కేశవరెడ్డికి చెందిన ఎడ్ల జత 4325.09 అడుగుల దూరంలాగి రెండో స్థానాన్ని, బాపట్ల జిల్లా వేటపాలెం మండలం చుండూరుకు చెందిన ఆర్‌కె బుల్స్, శిరీషా చౌదరికి చెందిన ఎడ్ల జత 4291.10 అడుగులు లాగి మూడో బహుమతిని, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన జే సహస్రయాదవ్, జేవీఎల్ యాదవ్‌కు చెందిన ఎడ్ల జత 3881.10 అడుగులు లాగి 4వ స్థానాన్ని సాధించాయి.

విద్యతోపాటు మహిళల అభివృద్ధిలో భాగస్వామి



బి.బబితను సన్మానిస్తున్న నిర్వాహకులు

పిడుగురాళ్ల: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విద్యతోపాటు మహిళల అభివృద్ధికి కూడా భాగస్వామి అవుతుందని సీఎస్ఆర్ డైరెక్టర్ బి.బబిత అన్నారు. పట్టణ శివారులోని కొండమోడులో ఏర్పాటు చేసిన ఉచిత జూట్ ఉత్పత్తుల తయారీ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ ఉచిత శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలను అందజేయటం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణను వదిలేయకుండా మహిళలు స్వయం ఉపాధికి ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. ఈ నెల రోజుల శిక్షణ తరగతులు 15 రకాల ఉత్పత్తులను శిక్షణ ద్వారా తయారు చేయటం నేర్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మందూరు వెంకటరమణ, శిక్షకురాలు పి.దుర్గా, పీఎస్ఆర్ డిగ్రీ కాలేజీ డైరెక్టర్లు కె.నరసింహారావు, బాడిస మస్తాన్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న కంటైనర్

తమిళనాడుకు చెందిన డ్రైవర్‌కు తీవ్రగాయాలు



యడ్లపాడు: హైవే సెంట్రల్ డివైడర్‌పై మొక్కలకు నీరు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను కంటైనర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ టి శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..తమిళనాడు చెందిన కంటైనర్ గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న క్రమంలో యడ్లపాడు మండలం బోయపాలెంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో హైవేపై మొక్కలకు నీళ్ల పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుండి ఢీకొట్టింది. సాయంత్రం 4 గంటలకు జరిగిన ఈ ప్రమాదంలో కంటైనర్ లారీ ముందుభాగం పూర్తిగా ధ్వంసం కాగా, డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కార్మికుల పోరాటాన్ని పట్టించుకోకపోవడం దారుణం

నరసరావుపేట: ఆప్కాస్‌లో ఉన్న తమకు పనిచేసిన రోజులు అన్నింటికి జీతం చెల్లించాలని కోరుతూ 30 రోజులుగా పారిశుద్ధ్య కార్మికుల చేస్తున్న పోరాటాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవటం దారుణమని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట తమ డిమాండ్ల సాధనకోసం కార్మికులు చేస్తున్న నిరసన దీక్షలు శనివారంతో 31వ రోజుకు చేరాయి. శిబిరాన్ని కృష్ణ సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలియచేసి మాట్లాడారు. ప్రభుత్వం ఎవరికోసం పనిచేస్తుందో అర్థంకావట్లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు తీరుస్తామని ప్రజలకు పలు వాగ్దానాలు చేసిన కూటమి నాయకులు తమకు నెలజీతం ఇప్పించమని కోరుతున్న కార్మికులవైపు చూడకపోవటం వారి నైజం తెలియచేస్తుందన్నారు. కార్మికులు చేస్తున్న పోరాటానికి తమ సంఘం పూర్తిగా మద్దతు తెలియచేస్తుందన్నారు. వెంటనే అధికారులు కలుగచేసుకొని వారికి పూర్తిజీతంతో పాటు విధుల్లోకి తీసుకోవాలని కోరారు.